క్లుప్తంగా

నేతాజీకి నివాళి



నేతాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఆదివారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో భారత్ సురక్షా సమితి నేతలు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏసీఎస్ రాజు మాట్లాడుతూ ఆజాద్ హిందూ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి ఆంగ్లేయులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన నేతాజీ సుభాస్‌చంద్రబోస్ దేశ స్వాతంత్ర్యానికి బాటలు వేశారన్నారు.దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీనాథం, ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మేడిపల్లి: మండలంలోని వెంకట్రావుపేట, కమ్మరిపేట, భీమారం గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై జగిత్యాల సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులు పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. దోమల బెడద, ఇళ్ల చుట్టు నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ఇతర సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కల్లెడలో ఉచిత వైద్య శిబిరం



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో జగిత్యాల స్టార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం చిన్న పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ప్రశాంత్ రెడ్డి చిన్నారులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు గుండారపు శ్రీనివాస్, నాయకులు అంకతి మొగిలి, తిరుపతి రెడ్డి, మంచాల గంగన్న, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠరథం వితరణ



వైకుంఠ రథం వితరణ ఇచ్చిన దాతలు

పెగడపల్లి: మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన చింతకింది సత్యనారాయణ స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు సీఎస్ఎన్ ఫౌండేషన్ ప్రారంభించి, ఆదివారం ఫౌండేషన్ తరుపున బతికపల్లి గ్రామానికి వైకుంఠరథం వితరణ ఇచ్చారు. వైకంఠరథం ద్వారా ఉచిత సేవలు కల్పిస్తున్నామని బతికపల్లితో పాటు మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ట్రస్టు సభ్యులు అనసూర్య, కిరణ్, కిశోర్, రఘు, స్థానికులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న నాయకులు

మేడిపల్లి: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, భీమారం మండలంలోని ఒడ్యాడ్ గ్రామానికి చెందిన సబ్బని వేణి మల్లవ్వకి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.30 వేల రూపాయల చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దువ్వాస గంగాధర్, పుట్ట రాజేందర్, సురకంటి రాజిరెడ్డి, కొత్తపెల్లి అజయ్, లింగంపల్లి గంగరాజం,తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం సర్వాయి పాపన్న



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్, నాయకులు

జగిత్యాల రూరల్/జగిత్యాలజోన్/కోరుట్ల/కోరుట్ల రూరల్/గొల్లపల్లి/ధర్మపురి/రాయికల్/కథలాపూర్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/మేడిపల్లి/మెట్‌పల్లి/ పెగడపల్లి: దళిత,బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన గొప్ప వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న అని, నేటి తరం ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహంను ఆదివారం ఆవిష్కరించి నివాళి అర్పించారు. ధర్మపురిలోనూ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొని నివాళి అర్పించారు.

జిల్లా వ్యాప్తంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మల్లాపూర్ మండల కేంద్రం, సిరిపూర్‌లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, కథలాపూర్ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ ధర్మపురిలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి నివాళి అర్పించారు. పట్టణాల్లో మున్సిపల్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, మండల కేంద్రాలు, గ్రామాల్లో గౌడ సంఘం నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గౌడ కులస్తులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



సిరిపూర్‌లో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్



ఒడ్డెలింగాపూర్ లో గౌడ సంఘం నాయకుల నివాళి



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న నాయకులు



నర్సింగాపూర్‌లో గౌడన్న ల నివాళి



ఇబ్రహీంపట్నంలో నాయకుల నివాళి



మెట్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు బండి సంజయ్ పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న బండి సంజయ్

మల్యాల: మండలంలోని బాధిత కుటుంబాలను కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం రాత్రి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రామన్నపేట గ్రామానికి చెందిన వకుళాభరణం శ్రీనివాస్, అరుణ కుటుంబ సభ్యులను, మద్దుట్లలో బీజేపీ కార్యకర్త నరేందర్ ప్రమాదంలో గాయపడి మరణించగా, వారి కుటుంబ సభ్యులను, మల్యాలలో గుండేటి లావణ్య కుటుంబ సభ్యులు గుండేటి గంగారాంను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ నాయకులు ముదుగంటి రవీందర్ రెడ్డితో కలిసి పరామర్శించారు. చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నేరెళ్ల శ్రావణ్, కెల్లేటి రమేశ్, గాజుల మల్లేశం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



కూలిపోయిన ఇల్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

సారంగాపూర్: బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. బీర్‌పూర్‌లో రెండు రోజుల క్రితం పూడూరి లింగన్నకు చెందిన ఇల్లు కూలిపోయి ఆ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించి ఆర్థికసాయం అందించారు. లింగన్న కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. లింగన్న అనారోగ్యంతో బాధపడుతుండడంతో లింగన్నకు హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తానని భరోసా ఇచ్చారు. బీర్‌పూర్‌లో చెట్పల్లి దేవయ్య అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, మాజీ వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ నాయకులు గుడిసె జితేందర్, చెర్పూరి సుభాష్, చుంచు అభిలాష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన దేవేందర్‌కు రూ.28,500 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రిల్లో వైద్యం చేయించుకుంటే ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా డబ్బులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోలగాని సత్యం,మెండే రమేశ్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ను కలిసిన అల్లె పురుషోత్తం

రాయికల్: జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గా ఇటీవల నియామకమైన న్యాయవాది అల్లె పురుషోత్తం ఆదివారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పురుషోత్తంను అభినందించారు.

• జిల్లా స్థాయి యోగా పోటీల్లో కోరుట్ల గురుకుల విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: జిల్లా స్థాయి యోగా పోటీల్లో కోరుట్ల పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు హన్విత్,మిక్విన్,శశాంత్, రఘురామ్, అఖిల్,శివ,వర్షిత్, మారుతీ తదితరులు ప్రతిభ చాటి మెడల్స్ సాధించారు. జగిత్యాల శ్రీ చైతన్య జూనియర్ కళాశాల సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో 100 మందికి పైగా పాల్గొనగా, కోరుట్ల గురుకుల విద్యార్థులు 12 మంది రాష్ట్ర స్థాయి యోగా శిక్షణకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బండి బాబు, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, మానస, పీడీలు విద్యార్థులను అభినందించారు.

• ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేట, పైడిమడుగు, మాదాపూర్, కల్లూర్, యెఖీన్‌పూర్, కోరుట్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు ఆదివారం ఉదయం పట్టుకుని 13 ట్రాక్టర్లను పట్టుకున్నామని, కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కిషన్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రావు, వీఆర్వో సురేందర్ నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

• నేడు ఇసుకకు వేలం..

మండలంలోని నాగులపేటలో అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంపులను మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వాధీనం చేసుకున్నారు. అధికారులు పట్టుకున్న సుమారు 150 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు సోమవారం ఉదయం 11.30 గంటలకు వేలం వేస్తామని తహసీల్దార్ కిషన్ తెలిపారు.

• దాడి చేసిన నలుగురిపై కేసు

సారంగాపూర్: మండలంలో బట్టపల్లి గ్రామానికి చెందిన గంగాధరి సౌందర్య ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి, దాడి చేసిన నలుగురిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం బట్టపల్లి గ్రామానికి చెందిన సౌందర్య, ఆమె భర్త చిరంజీవి ఇంటిలోకి అదే గ్రామానికి చెందిన కుందూరి రాజయ్య, కుందూరి లక్ష్మి, దొంతాపూర్ గ్రామానికి చెందిన సుద్దాల రమ, సుద్దాల పద్మ సౌందర్య ఇంటిలోకి చొరబడి సౌందర్యను, ఆమె భర్త చిరంజీవిలపై కట్టెలతో దాడి చేయగా వారికి గాయాలయ్యాయి. సౌందర్య ఫిర్యాదు మేరకు రాజయ్య, లక్ష్మి, రమ, పద్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

• పీడీఎస్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేటలో పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ప్రజల నుంచి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఆదివారం దాడులు నిర్వహించగా 13 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయన్నారు. మొత్తం నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, 4 ద్విచక్ర వాహనాలు,4 ఫోన్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు ఎమ్మెల్సీ సన్మానం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రమణ

మల్లాపూర్: సామాజిక సేవలతో పాటు యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహానంది జాతీయ అవార్డు గ్రహీత గనవేని మల్లేశ్(రేగుంట)ను ఆదివారం ఎమ్మెల్సీ రమణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు అందించిన సేవలకు జాతీయ అవార్డుతో మల్లేశ్‌కి తగిన గుర్తింపు వచ్చిందన్నారు. చిన్నివయస్సులోనే మల్లేశ్ జాతీయ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలను కొనసాగిస్తూ మంచిపనులతో ప్రజలతో మన్ననలు పొందాలని సూచించారు.

ఎల్‌వోసీ అందజేత

కోరుట్ల రూరల్: మండలంలోని నాగుపేట గ్రామానికి చెందిన చిలివేరి లక్ష్మికి మంజూరైన రూ.1లక్ష పదివేల ఎల్‌వోసీని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదివారం లబ్ధిదారునకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖయ్యూం, మాజీ సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి, సుధాకర్, పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

వెల్గటూర్: మండల ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఆకుల సంజీవరావు ఇటీవల వెల్గటూర్ నుంచి బదిలీపై వెళ్లగా, పంచాయతీరాజ్ ఏఈ రాజ్‌కుమార్ కూడా వెల్గటూర్ నుండి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి వెల్గటూర్ మండల తాజా మాజీ సర్పంచులు ఆదివారం ఆత్మీయంగా సత్కరించారు.

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్ష పదవికి రెండు నామినేషన్లు

జగిత్యాలజోన్: జిల్లా రెడ్డి సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు అధ్యక్ష పదవికి జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన కొప్పెర వెంకట్ రెడ్డి, చాణక్య విద్యా సంస్థల అధినేత అన్నాడి మనోహర్ రెడ్డి నామినేషన్‌లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు ఈ నెల 20 వరకు కొనసాగనుందని, సెప్టెంబర్ 1న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి నర్సింహారెడ్డి తెలిపారు.

తుర్తిలో ఒకరికి డెంగీ పాజిటివ్

కథలాపూర్: మండలంలోని తుర్తిలో ఓ యువతికి డెంగీ జ్వరం పాజిటివ్ వచ్చినట్లు వైద్యాధికారి రచన ఆదివారం తెలిపారు. యువతి జ్వరంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం అంబారిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి శనివారం వచ్చారన్నారు. అక్కడ వైద్యసిబ్బంది రక్త పరీక్షలు చేశారు. డెంగీ పాజిటివ్‌గా రావడంతో వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసినట్లు వైద్యాధికారి రచన తెలిపారు. బాధితురాలి ఇంటితోపాటు పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు స్ప్రే చేయించామని ఆమె పేర్కొన్నారు.



కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆదర్శనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారి వర్షాలకు బరదమయమై చిత్తడిగా మారింది. తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఎంపీడీవో, ఐకేపీ, ఎంఈవి కార్యాలయాలు కూడా ఇక్కడనే ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
బట్టు తిరుపతి,మున్సిపల్ కమిషనర్ ఫోన్ నంబర్: 9849365471

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రజిత ఆదివారం కోరారు. కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, అటెండర్ పోస్టులకు మండలానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టులకు 18–45 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులన్నారు. ఆసక్తిగల మహిళలు ఈనెల 23వ తేదిలోగా కథలాపూర్ కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

రాయికల్: రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అదనపు సహాయక వంట మనిషి, స్వీపర్ పోస్టులకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గంగాధర్ ఆదివారం తెలిపారు. ఏడవ తరగతి పాసైన మహిళలు పాఠశాల కార్యాలయంలో ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

మోడల్‌స్కూల్ హాస్టల్‌లో..

ఇటిక్యాల మోడల్ స్కూల్‌లోని గర్ల్స్ హాస్టల్ లో వంట మనిషి 1, అదనపు సహాయం వంటమనిషి ఒకరు. నైట్ వాచ్ మెన్ 1 పోస్టులకు మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ శోభారాణి ఆదివారం తెలిపారు. ఈనెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం 8008476752 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మల్యాల: మండలంలోని కస్తూర్బా పాఠశాలలోఅసిస్టెంట్ కుక్–2, నైట్ వాచ్‌వుమెన్–1, నూకపల్లి మోడల్‌స్కూల్లో హెడ్‌కుక్–1, నైట్ వాచ్‌వుమెన్–1 పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఐత శ్రీనివాస్ తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టుల అభ్యర్థులు మల్యాల మండలానికి చెంది, 18 ఏళ్ల నుండి 45 ఏళ్ల వయసు కలిగి ఉండి, 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. నైట్‌వాచ్ వుమెన్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 18ఏళ్ల నుండి 45ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9550710567లో సంప్రదించాలని కోరారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్‌స్కూల్ హాస్టల్‌లో నియమించే పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో భీమయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో ఎస్సెస్సీ పూర్తయిన వారు హెడ్‌కుక్, 7వ, తరగతి చదివిన వారు అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని, మోడల్ స్కూల్ హాస్టల్‌లో నర్సింగ్, ఇంటర్ పూర్తయిన వారు ఏఎన్ఎంకి, పదోతరగతి పూర్తయిన వారు వాచ్‌మెన్ మండలానికి చెందిన మహిళలు ఈ నెల 23లోగా పూర్తి బయోడేటాతో కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ మోడల్ స్కూల్‌లో ఏఎన్ఎం,ఇతర,పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో గంగుల నరేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్ఎం, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్ ఉమెన్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఔత్సాహికులు 19 వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కల్లూర్ కేజీబీవి పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాలకు కే. సుమలత సెల్ నెంబర్ 7780775410 కు సంప్రదించాలని పేర్కొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి కేజీబీవీలో అదనపు సహాయక వంట మనిషి,స్వీపర్ కమ్ స్కావెంజర్ పోస్టు, మోడల్ స్కూల్‌లో ఏఎన్ఎం పోస్టుకు అర్హత గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో జమునాదేవి తెలిపారు. ఈ నెల 22 వ తేదీ లోపు కేజీబీవీ పాఠశాల యందు దరఖాస్తులు సమర్పించాలని వివరాలకు 8328091819 నందు సంప్రదించాలని సూచించారు.

సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఔత్సాహిక మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వాసం భీమయ్య తెలిపారు.మండలానికి చెందిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 23లోపు కస్తూర్బా బాలికల విద్యాలయంలో సమర్పించాలని సూచించారు.

కథలాపూర్: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఆనందరావు, ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ అనిత ఆదివారం కోరారు. కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, స్కావెంజర్(స్వీపర్) పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణులై మండలానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లో నైట్ వాచ్‌మెన్ పోస్టుకు పదోతరగతి ఉత్తీర్ణులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టులకు 18–45 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులన్నారు. ఆసక్తిగల మహిళలు ఈనెల 23వ తేదీలోగా కథలాపూర్ కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పెగడపల్లి:మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. 7వ తరగతి చదివిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. మహిళలు 7వ తరగతి మెమోతో పాటు, దరఖాస్తు ఫారాన్ని నింపి ఈ నెల 23 వరకు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సూచించారు.

మరణించి.. ముగ్గురికి వెలుగు పంచి..

మల్యాల: ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు ఆయన అవయవాలు దానం చేసి సేవకు మరణం లేదని నిరూపించారు. మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన ముస్కెల నరేందర్(50) మద్దుట్లలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడగా.. జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్స చేసినా కోమాలోకి వెళ్లడంతో వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన కుమారుడు రమేశ్ రాగా.. నరేందర్ అవయవ దానానికి భార్య పోచవ్వ, కుమారుడు ముందుకొచ్చారు. కిడ్నీలు, గుండె, ఊపిరితిత్తులు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం నరేందర్ అంత్యక్రియలు మద్దుట్ల గ్రామంలో నిర్వహించారు.



వెల్గటూర్, ఇబ్రహీంపట్నంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

వెల్గటూర్/ఇబ్రహీంపట్నం: వెల్గటూర్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2001–01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇబ్రహీంపట్నం జెడ్పీ హైస్కూల్‌లో 1998–99లో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని,యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు